క్లుప్తంగా

‘స్పందన’కు 22 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 22 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దిగొచ్చిన అల్లం ధర

సీతమ్మధార: కొద్ది నెలలుగా అల్లం ధర పెరిగిపోవడంతో వినియోగదారులు దానికి దూరమయ్యారు. రైతుబజార్‌లోనే కిలో అల్లం రూ.200 ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.250 వరకు విక్రయించేవారు. అల్లం ధర తగ్గుతూ... తగ్గుతూ సోమవారం నాటికి కిలో రూ.130కు దిగివచ్చింది. దీంతో వినియోగదారులు, వ్యాపారులు, తోపుడు బళ్ల, హోటళ్ల వారు అల్లం కోసం క్యూ కడుతున్నారు. ధర తగ్గడంతో జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.

రౌడీషీటర్ ఆత్మహత్యాయత్నం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో రౌడీషీట్ ఉన్న వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బర్మాక్యాంప్ తిక్కవానిపాలెంలో నివసిస్తున్న వంకా కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. ఇతడికి వివాహేతర సంబంధం ఉండటంతో భార్యతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోగా.. భార్యను ఆపే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవడంతో గదిలోకి వెళ్లి ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో కుమార్ భార్య, చుట్టుపక్కల ఉన్న వారు చూసి స్పందించడంతో అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం కుమార్ పరిస్థితి నిలకడగా ఉంది. ఆ ప్రాంతానికి చెందిన మహిళా పోలీస్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొని ఓ మహిళకు గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఓల్డ్ డైరీఫాం వద్ద నివసిస్తున్న పి.చంద్రశేఖర్ అనే వ్యక్తి సొంత పనుల మీద తన భార్యతో కలిసి ఆదివారం ఉదయం జ్ఞానాపురం వైపు వెళ్తున్నారు. అక్కడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి సదరు వ్యక్తికి ఫోన్ రావడంతో బైకు పక్కకు ఆపడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో కంచరపాలెం నుంచి వీరికి ఎదురుగా వస్తున్న ఆటో బైకుకు తగిలి అతడి భార్యకు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం క్షతగాత్రురాలి రాత్రి భర్త ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో దాడి చేసిన వ్యక్తి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వేణుకుమార్ అనే వ్యక్తిపై జరిగిన దాడి కేసులో ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 12న వేణుకుమార్ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న సమయంలో వెనుక నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అతడి తలపై గాయపరిచి గెడ్డలో పడేసిన విషయం తెలిసిందే. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఫోర్త్ టౌన్ పోలీసులు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం సోనియాగాంధీ నగర్‌లో నివసిస్తున్న మెరంగి కనకరత్నం(55) ఆదివారం ఇంటి నుంచి నరసింహనగర్ రైతుబజార్‌కు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కనకరత్నం మరణించింది. ఎస్ఐ కె.వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



సీతమ్మధార రైతుబజార్‌లో ఏర్పాట్లు

సీతమ్మధార: దేశ 77వ స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని సీతమ్మధారలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలు, పాఠశాలలు, అసోసియేషన్ల భవనాలను ముస్తాబు చేశారు. జాతీయ జెండాల డెకరేషన్‌తో అవన్నీ నిండుగా కళకళలాడుతున్నాయి. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సిబ్బంది త్రివర్ణ పతాక తోరణాలతో చక్కగా అలంకరించారు. ఈమేరకు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఏపీ ఈపీడీసీఎల్, పోలీస్ స్టేషన్, రైతుబజారు తదితర చోట్ల జాతీయ జెండాల ఎగరవేయనున్నారు. పలు ప్రాంతాల్లో ఇళ్లపై జాతీయ జెండాలు కట్టారు. ప్రత్యేకంగా దుకాణాల వద్ద జాతీయ జెండాలు, డెకరేషన్ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

బుల్లయ్య కళాశాలలో ‘గో గ్రీన్’



కళాశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న మేయర్ హరివెంకటకుమారి

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో గో గ్రీన్ పేరుతో మెగా ట్రీప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి చోటా మొక్కలు పెంచేలా చూడాలన్నారు. గో గ్రీన్‌లో భాగంగా మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందని, వాటిని సంరక్షించే బాధ్యత కళాశాల యాజమాన్యం తీసుకోవాలన్నారు. బుల్లయ్య కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్‌ను నిర్వహించడంతోపాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కళాశాల నిబద్ధతను, ముఖ్యంగా విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, సిబ్బందిని, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎండీకి ఎమ్మెల్యే వాసుపల్లి వినతి



సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను సోమవారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలిశారు. 41వ వార్డు జ్ఞానాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాగులేకపోవడంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆయనకు వివరించారు. ఆ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్స్ మహిళా కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఎండీకి ఎమ్మెల్యే వాసుపల్లి వినతిపత్రం అందజేశారు. దక్షిణ నియోజకవర్గంలో మొట్టమొదటిగా రూ.600 కోట్లతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ కేబులింగ్‌లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో పాత స్తంభాలను తొలగించాలని, తవ్విన గోతులను సక్రమంగా పూడ్చాలని సూచించారు. కొన్ని గోతులను కప్పకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. స్పందించిన సీఎండీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఉన్నారు.

దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం రేపు



సీతంపేటలో కొలువైన గణపతి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయ 31వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఆలయ అర్చకుడు నటరాజన్ మంత్రోచ్చారణతో తెల్లవారుజామున 4 గంటలకు దుర్గాగణపతికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అర్చనలు, హోమాలు జరుగుతాయన్నారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో భక్తులకు స్వామి దర్శనమిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు 108 కళాశాలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వానతో ఉపశమనం



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో కురుస్తున్న వర్షం

సీతంపేట: గత వారం రోజులుగా భగభగలాడుతున్న సూర్యప్రతాపం నుంచి ఉపశమనం కలిగేలా సోమవారం జోరువాన పలకరించింది. మే ఎండలను తలపించేలా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సోమవారం మధ్యాహ్నం అనుకోని అతిథిలా వచ్చిన వర్షం నగరవాసులకు కాస్త ఉపశమనం కలిగించింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారింది. సుమారు అరగంట సేపు కురిసిన వర్షానికి సీతంపేట, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లోని రహదారుల్లో నీరు చేరింది. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహన చోదకులు, పాదచారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు.

అందరి కృషితో కాలుష్య నియంత్రణ



ఆటోలో కార్యాలయానికి చేరుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు.

‘పార్టిషన్ డే’పై ఫొటో ఎగ్జిబిషన్



నాటి ఫొటోలను తిలకిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దేశ స్వాతంత్ర్యానికి ముందు రోజు జరిగిన విభజన భయానక దృశ్యాలను గుర్తుచేసుకుంటూ వాల్తేర్ డివిజన్‌లో సోమవారం పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను రైల్వేస్టేషన్ ఫొటో గ్యాలరీ వద్ద సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి, తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు రోజు భారతీయులు ఎంతో శ్రమ, కష్టాలను అనుభవించారన్నారు. విభజన కారణంగా సుమారు 2 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని గుర్తుచేశారు. నాటి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోర్ట్ పెన్షనర్లకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పోర్ట్ పెన్షనర్లు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లోని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. అపోలో ఆస్పత్రి వైద్యులు అసోసియేషన్ పెన్షనర్లకు బీపీ, సుగర్, ఈసీజీ, ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలిచ్చారు. పెన్షనర్లు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు పాటించాలని కార్పొరేటర్ అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు మాట్లాడుతూ పోర్ట్ పెన్షనర్ల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు వివిధ పోటీలు



చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం విజయమాలిని, టీచర్ కల్యాణి

కంచరపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎస్ఆర్ ట్రస్ట్ నేతృత్వంలో సోమవారం 54వ వార్డు ఐటీఐ కూడలిలోని కప్పరాడ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం విజయమాలిని, ఉపాధ్యాయులు గణేష్, ఉప్పల కల్యాణి వాటిని పర్యవేక్షించారు. విజేతలకు మంగళవారం జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని ట్రస్టు సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక



శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పులి రామారావు వ్యవహరించగా.. గొల్లకోట సుబ్బారావు అధ్యక్షతన ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా డీవీకే కుమార్, అధ్యక్షుడిగా కర్రి చక్రరావు, కార్యదర్శిగా మన్యపురి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గౌరపల్లి ఈశ్వరరావు, కోశాధికారిగా మొగలి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా అప్పికొండ శ్రీప్రకాష్, జనపరెడ్డి వెంకటరావు, మట్టిమోహన్‌రావు, 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం పనిచేస్తుంది.

దుర్గమ్మకు కానుకగా బంగారు గొలుసు



బంగారపు గొలుసును ఈవోకు అందజేస్తున్న దాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ): విశాఖపట్నంకు చెందిన జీవీఎస్ చైతన్య కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి సుమారు 16 గ్రాముల బంగారంతో తయారు చేసిన గొలుసును అమ్మవారికి కానుకగా సమర్పించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.